క్లుప్తంగా

రేపు తైబజార్ వేలం

తుక్కుగూడ: తుక్కుగూడ, రావిర్యాల తైబజార్ (వారాంతపు సంతల) వేలాన్ని సోమవారం ఉదయం 11గంటలకు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు కమిషనర్ వాణి తెలిపారు. 2025- 26 ఆర్థిక సంవత్సరానికి నిర్వహించే వేలానికి సంబంధించి ఈనెల 5న నోటిఫికేషన్ జారీ చేశామన్నారు. 6నుంచి 13వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించగా మొత్తం 12 అప్లికేషన్లు వచ్చాయని తెలిపారు. ఇందులో తుక్కుగూడ సంతకు సంబంధించి 10, రావిర్యాల సంతకు 2 దరఖాస్తులు వచ్చాయని వివరించారు. బ్యాంకు గ్యారెంటీ (సాల్వెన్సీ సర్టిఫికెట్) ఇవ్వని వారు సోమవారం ఉదయం 10 గంటలలోపు కార్యాలయంలో అందజేయాలని సూచించారు. లేదంటే వేలంలో పాల్గొనే అర్హత ఉండదని తెలిపారు.

18న ఉచిత కంటి వైద్య శిబిరం

తుక్కుగూడ: ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని దేవేంద్ర ఫౌండేషన్ సభ్యుడు తూళ్ల వీరేందర్ గౌడ్ అన్నారు. శ్రీనగర్‌లో శనివారం ఆయన మాట్లాడారు. 'మా నాన్న, హోంశాఖ మాజీ మంత్రి దేవేందర్‌గౌడ్ 73వ జన్మదినం సందర్భంగా' ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫీనిక్స్ ఫౌండేషన్, శంకర్ కంటి వైద్యశాల సౌజన్యంతో ఈ నెల 18న శ్రీనగర్‌లో వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కొనసాగుతుందని, కంటి సమస్య ఉన్నవారు వైద్య సేవలను వినియోగించుకోవాలని కోరారు. వెంట ఆధార్ జిరాక్స్, ఫోన్ నంబర్ తెచ్చుకోవాలని సూచించారు.

వైభవంగా సూరమాంబ బోనాలు



బోనాల ఊరేగింపు

తుక్కుగూడ: పుర పరిధిలోని రావిర్యాల సూరమాంబ కంఠమహేశ్వరస్వామి ఆలయ ప్రథమ వారికోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం వైభవంగా బోనాల ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూజకాలు, పోతరాజుల విన్యాసాల మధ్య ప్రజలు బోనంతో ఊరేగింపు ద్వారా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం స్వామి వారికి నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఫ్యూచర్ సిటీలో కలిపేందుకు కృషిచేస్తా

మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్



అఖిలపక్ష నాయకులతో మాట్లాడుతున్న కేఎల్లార్

కందుకూరు: ఫ్యూచర్ సిటీలో చేర్చాలని కోరుతున్న గ్రామాల వివరాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కలిపేలా తనవంతు కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ హామీ ఇచ్చారు. ఫ్యూచర్ సిటీలో తమ గ్రామాలను చేర్చాలని కోరుతూ మండల పరిధిలోని నేదునూరు, బాచుపల్లి, జైత్వారం, ధన్నారం, పులిమామిడి, చిప్పలపల్లి, మురళీనగర్, దావూద్‌గూడ, పెద్దమ్మతండాలకు చెందిన అఖిలపక్ష నాయకులు శనివారం ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబును కలవడానికి మినిస్టర్ క్వార్టర్లకు వెళ్లారు. కాగా అసెంబ్లీ సమావేశాల కారణంగా ఆయన వారితో కలవలేదు. అక్కడికి వచ్చిన మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ వారితో మాట్లాడారు. ఆయా గ్రామాల అభిప్రాయాన్ని మంత్రితో పాటు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ఫ్యూచర్ సిటీలో కలిపేలా చూస్తానని వారికి ఆయన హామీనిచ్చారు. కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

మంచాల: అర్హులందరికీ సంక్షేమ పథకాలు ప్రభుత్వం అందజేస్తుందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధి ఆరుట్ల గ్రామంలో కొత్త రేషన్ కార్డు మంజూరు పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. మండలంలో 755 మందికి కొత్తగా రేషన్ కార్డులు మంజూరు అయ్యాయని తెలిపారు. గత ప్రభుత్వం అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందించడంలో విఫలమైందని, రేషన్ కార్డులు కూడా ఇవ్వలేదని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తుందని పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ సాతిరి ఎల్లేష్, చెరుకు నర్సింహ, కృష్ణ, బుగ్గరాములు, అంతటి రాజు, సురేష్, బాషయ్య,పాల్గొన్నారు.

ఆటలకు.. అద్దె మైదానమే దిక్కు

అద్దెకు ఇళ్లు, దుకాణాలు, కార్యాలయాలే కాదు.. క్రీడా మైదానాలు లభ్యమవుతున్నాయి. ఆటలకు స్థలాలు లేక పోవడంతో.. ఆటలపై మక్కువతో ఉన్న ఆటగాళ్లు.. గంటకు ఇంతని ఫీజు చెల్లించి ఆడుతున్నారు.

క్రీడా ప్రాంగణాలకు నోచుకోని జల్‌పల్లి

- శ్రీరాం కాలనీలో బోర్డుకే పరిమితం



షాహిన్‌నగర్‌లో అద్దె మైదానం

పహాడీషరీఫ్: అద్దెకు కాదేదీ అనర్హం అన్నట్లు క్రీడా మైదానాలు పుట్టుకొచ్చాయి. జల్‌పల్లి మున్సిపాలిటీలో అందుబాటులోకి వచ్చాయి. వస్తున్నాయి. క్రికెట్, వాలీబాల్, ఫుట్‌బాల్ లాంటి ఆటలు ఆడుకునేందుకు బాక్స్ క్రికెట్ గ్రౌండ్‌లు భారీగా ఏర్పాటవుతున్నాయి. ప్రభుత్వ క్రీడా మైదానాలు లేకపోవడంతో యువత వీటిని ఆశ్రయిస్తున్నారు. ఆటలపై ఉన్న ఆసక్తితో గత్యంతరం లేని పరిస్థితుల్లో డబ్బులు చెల్లించి ఆడుకోవాల్సిన దుస్థితి కలిగింది. ఇక ఏదైనా పెద్ద టోర్నమెంట్ నిర్వహించుకోవాలంటే మైదానం వెతుక్కోవడం పైనే ప్రత్యేక ధ్యాస పెట్టాల్సి రావడం గమనార్హం. పహాడీషరీఫ్‌లో గతంలో కుస్తీ పోటీల మైదానం కోసం నిర్వాహకులు పడిన పాట్లు అన్నీ ఇన్నీ కావు. పోలీస్‌గ్రౌండ్‌లో పోటీలకు పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంతో.. చివరి క్షణంలో ప్రైవేట్ స్థలాన్ని ఎంచుకోవాల్సి వచ్చింది.

విన్నపాలు.. బుట్టదాఖలు

క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వ భూములను మైదానాల కోసం కేటాయించాలని పుర ప్రజలు పలుమార్లు ప్రజాప్రతినిధులకు విన్నవించంచారు. ఇంతకాలం స్థానిక యువతీయువకులు.. పహాడీషరీఫ్‌లోని ఇజ్తెమా గ్రౌండ్, జల్‌పల్లి మంచు టౌన్ షిప్ రోడ్డులోని ప్రైవేట్ స్థలాల్లో ఆడుతూ వచ్చారు. కానీ ప్రస్తుతం నిర్మాణ రంగం ఊపందుకొని ఖాళీ స్థలాలు కనిపించకుండా పోయాయి. దీంతో ప్రభుత్వం తరఫున క్రీడా మైదానాలను కేటాయించాల్సిన అవసరం ఏర్పడింది. ఏడాదికోసారి క్రికెట్, వాలీబాల్ లాంటి టోర్నమెంట్‌లు నిర్వహించాలనుకున్నా మైదానాలు లేని కారణంగా ప్రైవేట్ భూములను ఆశ్రయిస్తూ చీదరింపుల పాలవ్వాల్సి వస్తుందని పలువురు నిర్వాహకులు పేర్కొంటున్నారు.

పేరుకే ప్రాంగణం



అలంకారప్రాయంగా క్రీడా ప్రాంగణం

గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించాలని గత ప్రభుత్వం సంకల్పించింది. గ్రామానికో క్రీడా ప్రాంగణానికి శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు.. సంబంధిత అధికారులు మున్సిపాలిటీ పరిధి మూడు ప్రైవేట్ వెంచర్లలో మున్సిపాలిటీకి కేటాయించిన స్థలంలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అందులో భాగంగానే శ్రీరాం కాలనీలోని నిధి వెంచర్‌లో 2022 ఆగస్టు 3న రెండు వేల గజాల స్థలంలో 'తెలంగాణ క్రీడా ప్రాంగణం' బోర్డును ఏర్పాటు చేశారు. చుట్టూ మొక్కలు నాటారు. క్రీడాకారుల కోసం వాలీబాల్, బ్యాడ్మింటన్, షటిల్, స్కేటింగ్ తదితర గ్రౌండ్‌లను నిర్మిస్తామని చెప్పారు. కానీ కార్యరూపం దాల్చలేదు.

స్థలం కేటాయించాలి



చక్కటి ఆరోగ్యం కోసం వ్యాయామం చేద్దామన్నా.. మక్కువ ఉన్న ఆటకు పదును పెడదామన్నా.. ఎక్కడా మైదానాలు లేవు. ఏటా జల్‌పల్లి ప్రీమియర్ లీగ్ క్రికెట్ మ్యాచ్‌ను మంచు టౌన్ షిప్ రోడ్డులోని ప్రైవేట్ భూమిలో ఆడుతున్నాం. గ్రౌండ్ ఏర్పాటు చేయాలని ఏళ్లుగా ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవిస్తున్నాం. కానీ ఫలితం లేదు. మైదానం కేటాయించి, జీహెచ్‌ఎంసీ మాదిరిగా సమ్మర్ క్యాంప్‌లను నిర్వహించాలి. **– గౌర మురళీ కృష్ణ, జల్‌పల్లి**

అంగన్‌వాడీల ధర్నాను విజయవంతం చేయండి



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న శేఖర్, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు

సీపీఎం మండల కార్యదర్శి శేఖర్

మహేశ్వరం: అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 17, 18 తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కలెక్టరేట్ల ఎదుట నిర్వహిస్తున్న ధర్నా, వంటావార్పు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల శేఖర్ కోరారు. శనివారం మండల కేంద్రంలో సీడీపీఓ ప్రాజెక్టు కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లతో కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యల పరిష్కారం కోసం సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా, వంటావార్పు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసే పీఎం శ్రీ పథకాన్ని, మొబైల్ అంగన్‌వాడీ సెంటర్లను వెంటనే రద్దు చేయాలని, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన విద్యా విధానం చట్టాన్ని అమలు చేయకుండా ఆపాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. ఆయా నిరసన కార్యక్రమాల్లో ప్రతీ అంగన్‌వాడీ టీచర్, హెల్పర్లు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు మండల కేంద్రంలో ఐసీడీఎస్ కార్యాలయంలో అధికారులకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

ఏఐ పరిజ్ఞానంతో విద్యార్థులకు మేలు

ఎంఈఓ పురన్‌దాస్



మాట్లాడుతున్న ఎంఈఓ పురన్‌దాస్

చేవెళ్ల: మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థులను సిద్ధం చేసేందుకు ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) కంప్యూటర్ పరిజ్ఞానాన్ని విద్యార్థులకు పరిచయం చేయడం హర్షణీయమని మండల విద్యాధికారి ఎల్.పురన్‌దాస్ అన్నారు. మండలంలోని తంగడపల్లి పాఠశాలలో శనివారం ఏఐ కంప్యూటర్ పరిజ్ఞానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా నుంచి ఎంపిక చేసిన పాఠశాలలో తంగడపల్లి ఉండటం విద్యార్థుల అదృష్టమన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాండు, గ్రామస్తులు సయ్యద్ గయాస్, జాకీర్, గ్రామ కార్యదర్శి రాఘవేందర్‌రెడ్డి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో ప్రతిదీ సాధ్యమే

- ప్రధానోపాధ్యాయురాలు రేవతి
- దూసకల్ పాఠశాలలో పేరెంట్స్ కమిటీ సమావేశం

షాద్‌నగర్: కృషి, పట్టుదల ఉంటే ఏదీ అసాధ్యం కాదని హెచ్‌ఎం రేవతి అన్నారు. శనివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని దూసకల్ ప్రాథమిక పాఠశాలలో పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. విద్యార్థులు భవిష్యత్తులో చేపట్టే వృత్తులు, వారి కలలు అనే అంశంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంబంధిత వేషధారణలో పాఠశాలకు హాజరయ్యారు. కలెక్టర్‌గా సిరిచందన, ఉపాధ్యాయురాలిగా అవంతిక, డాక్టర్‌గా రేనీషా, నర్స్‌గా తనుశ్రీ, ఇంజనీర్‌గా శ్రావ్య, పోలీస్‌గా రమ్య వ్యవహరించారు. అనంతరం వారి భవిష్యత్తు ప్రణాళికను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు వివరించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ.. చిన్ననాటి నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సురేందర్‌రెడ్డి, అన్నపూర్ణ, శైలజ, బుద్ధదేవ్, రెడ్యాలాల్, సంతోష్‌బాబు, సర్ఫరాజ్ అన్వర్, డాక్టర్ శ్వేత పాల్గొన్నారు.



విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

హామీల పేరుతో మోసం

బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు నర్సింహయాదవ్

కేశంపేట: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అమలుకు నోచుకోని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని బీజేపీ మాజీ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్ అన్నారు. మండల కేంద్రంలో బీజేపీ నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో నర్సింహయాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలతో పాటు రైతులను మోసం చేసిందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆరోపించారు. బీఆర్‌ఎస్‌ను వదిలి కాంగ్రెస్ పార్టీని నమ్మిన రైతులు, సబ్బండవర్గాల ప్రజలు మళ్లీ మోసపోయారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా రైతులకు ఇచ్చిన రైతు భరోసా వెంటనే అందించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతు భరోసా నిధుల విడుదలను రాష్ట్ర ప్రభుత్వం జనవరి నెలలో మొదలుపెట్టినా మార్చి నెల ముగుస్తున్నా నేటికీ అందరికీ అందలేదని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలు, రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నరేందర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణ తరువాతే ఉద్యోగాల భర్తీ

ఆమనగల్లు: ఎస్సీ వర్గీకరణ చేసిన తరువాతే ఉద్యోగ నియామకాలు చేపట్టాలని, మాదిగలకు జనాభా ధమాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి పోతుగంటి కృష్ణమాదిగ డిమాండ్ చేశారు. వర్గీకరణ చేయాలని డిమాండ్ చేస్తూ తలకొండపల్లి మండల కేంద్రంలో సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్ష శనివారం ఐదో రోజుకు చేరుకుంది. దీక్షా శిబిరాన్ని సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి జ్యోతయ్య ప్రారంభించారు. శిబిరంలో నాయకులు బాలస్వామి, రాములు, శివ, పెంటయ్య, ప్రదీప్, మహేశ్, శంకరయ్య, జగన్‌లు కూర్చున్నారు. కార్యక్రమంలో సమితి నాయకులు కుమార్, నారాయణ, సంపత్, మహేశ్, శేఖర్, సురేశ్, జంగయ్య, గిరి, ఉపేందర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం చీపునుంతల గ్రామంలో రూ.15 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో ఎస్‌డీఎఫ్ కింద రోడ్డు నిర్మాణానికి రూ.15 లక్షలు మంజూరయ్యాయని వారు వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు గుజ్జల మహేశ్, ఎస్సీసెల్ అధ్యక్షుడు చెన్నకేశవులు, నాయకులు వెంకట్‌రెడ్డి, వెంకట్‌రాజిరెడ్డి, మల్లేశ్‌గౌడ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు మార్కెట్ పాలకవర్గం ప్రమాణస్వీకారం

- హాజరుకానున్న ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్
- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సభావత్ కృష్ణానాయక్



మాట్లాడుతున్న కృష్ణానాయక్

మహేశ్వరం: మహేశ్వరం మార్కెట్ కమిటీ చైర్మన్ పాలకవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవం సోమవారం ఉదయం 8 గంటలకు నిర్వహించనున్నట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ సభావత్ కృష్ణానాయక్ తెలిపారు. కార్యక్రమానికి ఐటీ పరిశ్రమల శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ హాజరవుతున్నారని పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో వారు సమావేశం నిర్వహించి మాట్లాడారు. మహేశ్వరం మండల పరిషత్ సమావేశ మందిరంలో మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణస్వీకారం అధికారుల సమక్షంలో నిర్వహిస్తామని తెలిపారు. ఉదయం 7 గంటలకు తుక్కుగూడ ఔటర్‌రింగ్ రోడ్డు ఎగ్జిట్ నుంచి మంత్రి, మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకులతో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రమాణస్వీకారానికి నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, రైతులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చాకలి యాదయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కంబాలపల్లి విష్ణువర్ధన్‌రెడ్డి, మహేశ్వరం టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బంగారిగళ్ల లాజర్, నాయకులు చంద్రమోహన్, ఈశ్వర్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

కాన్షీరామ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



షాబాద్: కాన్షీరామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



కేశంపేటలో..

షాబాద్: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేసిన కాన్షీరామ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని తెలంగాణ జనసమితి చేవెళ్ల డివిజన్ ఇన్‌చార్జి నాగని రామకృష్ణ(ఆర్కే) పేర్కొన్నారు. శనివారం కాన్షీరామ్ జయంతి సందర్భంగా మండల పరిధిలోని నాగర్‌గూడ చౌరస్తాలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సైకిల్‌పై భారతదేశాన్ని చుట్టి బహుజనులను చైతన్యం చేసి రాజ్యాధికార ప్రాముఖ్యతను చాటిచెప్పారన్నారు. కార్యక్రమంలో మాజీ కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఆయూబ్, తాళ్లపల్లి అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు అక్కమొళ్ల ఆంజనేయులు, నాయకులు బాలరాజ్, మల్లేశ్ ఉన్నారు.

ఘన నివాళి

కొందుర్గు: మాన్యశ్రీ కాన్షీరామ్ జయంతి సందర్భంగా శనివారం మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్, నాయకులు పెంటయ్య, సంజీవ, నవీన్ పాల్గొన్నారు.

కేశంపేటలో..

కేశంపేట: మండల కేంద్రంలో బహుజనుల ముద్దుబిడ్డ మాన్యశ్రీ కాన్షీరాం జయంతిని ధర్మసమాజ్ పార్టీ మండల అధ్యక్షుడు మహిపాల్ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాన్షీరాం చిత్రపటానికి పూలమాలలు వేసిన అనంతరం కేక్ కట్‌చేసి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో మల్లేశ్, శివ, రవి, ఆనంద్, విష్ణు, కృష్ణ, శ్రీకాంత్, పురుషోత్తం, నరేశ్, శ్రీకాంత్, కృష్ణ, భాస్కర్, ప్రవీణ్, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ కమిటీ ప్రమాణ స్వీకారం



ప్రమాణస్వీకార కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

కొందుర్గు: మండలంలోని చింతల్ శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయ నూతన కమిటీ సభ్యులు శనివారం ఈఓ శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్‌గా రాఘవేందర్‌గౌడ్, వైస్ చైర్మన్‌గా లంకాల రామకృష్ణారెడ్డి, సభ్యులుగా ఊషయ్య, యాదమ్మ, చెన్నయ్య ప్రమాణం చేశారు. కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, కొందుర్గు లక్ష్మీనర్సింహాస్వామి దేవాలయ కమిటీ చైర్మన్ కృష్ణయ్య, నాయకులు మాసయ్యగౌడ్, లింగంగౌడ్, శివారెడ్డి, శ్రీశైలం పాల్గొన్నారు.

ఒంటిపూట బడులు ప్రారంభం



అజీజ్‌నగర్ పాఠశాలలో ప్రార్థనలో పాల్గొన్న విద్యార్థులు

మొయినాబాద్‌రూరల్: ఒంటి పూట బడులు శనివారం నుంచి ప్రారంభమైనట్లు మండల విద్యాధికారి వెంకటయ్య తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు తరగతులు కొనసాగుతాయని పేర్కొన్నారు. విద్యార్థులు సమయాన్ని పాటిస్తూ పాఠశాలలకు చేరుకోవాలని, పాఠశాలలు వదిలిన తర్వాత ఎండలో తిరగకుండా తమ ఇళ్లకు చేరుకోవాలని సూచించారు.

బీఆర్‌ఎస్ నాయకులపై ఫిర్యాదు



సీఐకి ఫిర్యాదు అందజేస్తున్న ఎన్‌ఎస్‌యూఐ నేతలు

ఇబ్రహీంపట్నం: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫొటోలను మార్ఫింగ్ చేసి, అభ్యంతరకరమైన రీతిలో సోషల్ మీడియాలో పోస్టు చేసిన బీఆర్‌ఎస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని ఎన్‌ఎస్‌యూఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఇబ్రహీంపట్నం సీఐ జగదీశ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు నందకిషోర్ మాట్లాడుతూ.. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో రేవంత్ ప్రతిష్ఠతను దెబ్బతీసేవిధంగా సామాజిక మాధ్యమాల్లో ఫొటోలు పెట్టడం దారుణమన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో కిషోర్‌తో పాటు ఆ సంఘం నేతలు అయ్యాన్, సచిన్, వెంకట్ ఉన్నారు.

అంబలి కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి



బాటసారులకు జావ అందజేస్తున్న లయన్ సభ్యులు

కడ్తాల్: రాగి అంబలి కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి అన్నారు. రంజాన్ సందర్భంగా శనివారం మండల కేంద్రంలో మహ్మద్ బాసిత్‌అలీ– ఖైరున్నీసా బేగం జ్ఞాపకార్థం వారి కుమారులు ఏర్పాటు చేసిన అంబలి కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఏటా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బాటసారుల కోసం అన్నదానం, అంబలి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జావ తీసుకోవడం వలన చల్లదనంతో పాటు, పౌష్టికాహారం అందుతుందని చెప్పారు. కార్యక్రమంలో జహంగీర్‌అలీ, లాయఖ్‌అలీ, అజ్గర్‌అలీ, ఆసిఫ్‌అలీ, హిమాయత్‌అలీ, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, క్లబ్ సభ్యులు గోవర్ధన్‌రెడ్డి, రాజేందర్ యాదవ్, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, నాయకులు నేతిప్రభు, లింగం, ఇమ్రాన్‌బాబా, లక్ష్మయ్య ఉన్నారు.